# ఆపదేవుడు

తాతగారి పేరు ఆపదేవుడు. తండ్రి అనంతదేవుడు. ఆయన పేరు ఆపదేవుడు. ఆయన తన కుమారునకు అనంత దేవుడని పేరు పెట్టెను. వారిది 17వ శతాబ్దమునాటి వేద పండిత కుటుంబము. మహారాష్ట్రదేశమందలి గోదావరీ ప్రాంత వాసులు. తాతగారైన ఆపదేవుడు గొప్ప పండితుడు. తండ్రి అనంతదేవుడు ప్రసిద్ధుడైన మీమాంసవేత్త. ఆపదేవుడు "ఆపదేవీయము" అనిన మీమాంసగ్రంథము వ్రాసెను. కుమారుడైన అనంతదేవుడు వ్రాసిన గ్రంథము పేరు "స్మృతి కౌస్తుభము". మీమాంస, వేదమునందలి యజ్ఞ కర్మవాక్యములను, అందలి శబ్దములను విచారించి, ఆ కర్మలను ఎట్లు చేయవలెనో తెలియజెప్పును. కనుక మీమాంసకులు వేదశబ్దములను గూర్చి తెలిసినవారు.

అట్టి వేదపండిత కుటుంబమునందు ఆపదేవ–అనంతదేవ శబ్దములు తరములుగా, తండ్రికొడుకుల నామ ధేయములుగా నున్నవనగా, వారికా శబ్దములందు గౌరవమున్నదన్నమాటయే గదా! ఆ రెండు వేదశబ్దములు, అంతటి పండితులకు ప్రియమైనవి కావున వాటి యర్థములనుమనము గూడ తెలుసుకొనవలయునుగదా! ఈ వ్యాసము ఆపదేవుని మీద. అనంతదేవుని గురించి మరియొకసారి.

అకారము ఆరంభాక్షరము. పుట్టుకతో మనవెంట వచ్చిన శక్తి, జ్ఞానముల చిహ్నము. పకారము చివరి స్పర్శల (ప, ఫ, బ, భ, మ) లోనిది. పకారముచ్చరించుటకు మన వాగ్యంత్రము సంపూర్తిగానుండవలెను. పెదిమెలు సమముగా లేనివారు "ప" ను పలుకలేరు. పన్నులు లేనిచో, పకారోచ్చరణము తొస్సుపోవును. పకారము మనయొక్క పూర్తి స్వరూపమునకు గుర్తు. మన పూర్తి స్వరూపమునందు, ఒక్క మన శరీరమే కాదు, మన జ్ఞానము, మన ఆనందము, మన కోరికలు, మనదైన సర్వమున్నది. మనము ఈ స్వరూపములో నుండుటకు మనమొక్కరమే కారణము కాదు. ఇంకను అనేకములయిన కారణములున్నవి. మన తండ్రి తాతల గుణములు, వారి రోగములు మన జీవకణముల (DNA Molecule) మీద ముద్రితమై పుట్టినాము. ఇంక మూడవ కారణమున్నది.అది ఏదియో మనకు వివరముగా తెలియనిది. మనము చేయదలచుకొనినది ఒకటి. జరిగినది ఇంకొకటి. ఈ శక్తి మనలో కూర్చొని యున్నది. ఇది మన అధీనములో లేని శక్తి. మన అధీనము నందు లేని శక్తిని వేదము "దేవత" అనును. మన శక్తి, మన పితృదేవతాశక్తి, దేవతా శక్తి – ఈమూడును కలసి మన స్వరూపమయినది. కనుకనే, వేదమునందు ఏ యజ్ఞమును జూచినను, మన యందున్న ఈ మూడుభాగములను తృప్తి పరచుటకు, ఆనందపరచుటకు ప్రయత్నముగా నుండును. ఈ మూడు స్థితులలోను, ఇదివరకు కంటె ఆధిక్యమును సంపాదించు యత్నముగా నుండును.

ఈ విధముగా, ఈమూడు శక్తులను తగిన పాళ్ళలో కలిపి, మన కర్మఫలితములను, అనగా మనము చేసిన కర్మల వలన పుట్టిన కష్టసుఖములను, దారిద్ర్యభాగ్యములను, దుఃఖానందములను అనుభవించుటకు చక్కగా సరిపోయిన మూర్తిగా పోతపోసినదెవరు? వాటిని అనుభవించుటకు వీలైన చోటునందు మాత్రమే పుట్టించినదెవరు? మా తాత ముత్తాతలు దాతలు, వీరులు, ధైర్యసాహసోపేతులై ఉండగా, నా ఎతృదేవతా స్థానమునందు వాటి ముద్రను

తగ్గించి, వారియందున్న రోగముల ముద్రను గట్టిగా ముద్రించినదెవరు? ఆ శక్తిని వేదము "అపః", అనినది. అకారముతోనారంభించి, పకారముతో మన స్వరూపమును పూర్తిజేసిన శక్తి గనుక, దాని పేరు "అపః". ఇది వేదభాష నిర్మాణ పద్ధతి.

స్వరూపము అనగనే, మన మనస్సునందు - అనగా భావనా వీధిలో ప్రత్యేకమైనది, వేరైనదిగా భావింప గలుగుట కనుక, భావములు, ద్రవ్యములు, శక్తులు, అన్నిటికిని స్వరూపములున్నవి. మన భావనా వీధిలో పుట్టిన చిన్న ఊహ మొదలుగా, విశ్వపు చివరి అంచులయందున్న నక్షత్ర గోళములవరకు సమస్త స్వరూప నిర్మాణ కర్త "అపశ్శక్తి". ఈ ఆకారమును, స్వరూపమును కల్పించుట, ఆ మహాచైతన్యము (బ్రహ్మ) యొక్క ప్రధాన లక్షణములలో నొకటి.

ఈ శక్తి పనిచేయునపుడు, ఆ శబ్దమునందలి ప్రధానాక్షరమునకు దీర్ఘముండును. అ-కారము ప్రధానాక్షరము. ప-కారము పొందెడు రూపమునకు చిహ్నము. అపశ్శక్తి పనిచేయునపుడు వేదము దానిని " ఆపః " , అనును.

ఈ సృష్టియందు నూత్నస్వరూపములు (భావనా స్వరూపమ్ములు కానిమ్ము, లేక భౌతిక స్వరూపములు కానిమ్ము) నిరంతరము పుట్టుచునే యున్నవి. వీటిని కల్పించు మూలశక్తి "అపః". ఆయా స్వరూపములను కల్పించు వేళ, వేదమా శక్తిని "అపః" అనును. భావమునందు గాని, బాహ్యమునందుగాని, స్వరూపనిర్మాణము పూర్తి అయిన తరువాత, అవతరించిన క్రొత్త వస్తువులన్నియు "ఆపాః". వేదమీ సృష్టియందలి నిరంతర పరిణామము (Continuous Change) యక్క మూడు స్థితులను విడమరచి చెప్పుటకుపయోగించిన శబ్దములు " అపః, ఆపః, ఆపాః" .

**ఆపోవై భేషజమ్; వజ్రోవా ఆపః;**
**అమృతంవా ఆపః; దివ్యా ఆప ఓషధయః** – తైత్తిరీయారణ్యకము (1-31)

భేషజము, వజ్రము, అమృతము, ఓషధులు - అన్నియు ఆపమే. సంస్కృతభాషాశబ్ద దృష్టితో జూచినచో ఇవి యన్నియు నీటియొక్క రూపములు అని చెప్పవలయును. అప్పుడు వేదమర్థమగుట కష్టము.

ఋగ్వేదమునందు అపశ్శక్తిని నుతించు ఋక్కులున్నవి. ఋగ్వేదమును మాత్రమే చూచినచో, వాటి సంపూర్ణార్థము గోచరము కాదు. నాలుగు వేదభాగముల యందును ఎచ్చటెచ్చట ఆ శక్తిని వివరించుట ఉన్నదియో ఆ అన్నిచోటులను పరికింపవలెను.

**"యజ్ఞోవా ఆపః"** – తైత్తిరీయబ్రాహ్మణము (3-2-4)
యజ్ఞము "ఆపః" యే. అనగా, అపశ్శక్తితో, మనము ఉత్తమస్థితిని పొందుటకైన యత్నమే యజ్ఞము.

**"ఆపమాపా మప స్సర్వాః"**
**అపమ్, ఆపామ్, అపః సర్వాః** – తైత్తిరీయారణ్యకము (1-25)

ఆపమ్ – అకారములను కలించుచున్న శక్తులందును,

ఆపామ్ – కదులుచున్న అకారములందును

ఇచ్చట "అ", "ప", రెండు అక్షరములకును దీర్ఘమున్నది. రెండు అక్షరములకును దీర్ఘమిచ్చి, వేదము, కల్పింపబడిన స్వరూపమును సూచించుచున్నది. వేదమింత జాగ్రత్తగా చూడవలసిన గ్రంథము. అందువలననే, ఒక్క అక్షరము, ఒక్క ఒత్తు, ఒక్క ఉచ్చారణ పొల్లు పోకుండ, అవతరించిన నాటినుండి ఈనాటి వరకును ఉండవలసిన గ్రంథము,ఉన్న గ్రంథము. తక్కిన గ్రంథములవంటిది కాదు.

సర్వాః – ఉన్నదంతయును; అపః – అపశ్శక్తియే

"ఆపః" కానిమ్ము, "ఆపాః" కానిమ్ము; సర్వము అపశ్శక్తియే అని ఈ అరణ్యక మన్త్రము చెప్పుచున్నది. ఈ "అపః", "ఆపః", "ఆపాః" శబ్దములందలి అర్థములను ఊహజేసిన కొలది, భావించిన కొలది, తపస్సు జేసిన కొలది, సృష్టి స్వరూపము విదితమగును. ఇది ఎరికి వారు తెలుసుకొనవలసిన విషయము. ఇంకొకరు చెప్పెడిది కాదు.

**ఆపోవా ఇదగ్ం సర్వమ్ – సామ్రాడాపః**
**విశ్వా భూతాన్యాపః – విరాడాపః**
**ప్రాణావా ఆపః – స్వరాడాపః**
**అమృతమాపః – ఛందాగ్ స్యాపః**
**జ్యోతీగ్ం షాపః, సత్యమాపః,**
**సర్వాదేవతా ఆపః; భూర్భువస్సువరాప ఓమ్** – తైత్తిరీయోపనిషత్తు (4–22)

ఆపోవా ఇదగ్ం సర్వమ్ – అని మొదటి వాక్యము. ఇక్కడ (ఇదగ్ం) ఉన్నదంతయును ఆపమే. ఇక్కడ అనగా ఎక్కడ? మన భావనలో, మన చూచుటలో.

పైన చెప్పిన ఉపనిషద్వాక్యములలోని భావములు నాలుగు వేదముల మంత్రభాగములందును ఉన్నవి. తైత్తిరీయోపనిషత్తునందు, వాటినన్నిని ఒకచోట జేర్చి, ఇది కర్మరూపమయిన బ్రహ్మలక్షణమని తెలియజేసినది. బ్రహ్మలక్షణము గనుక, బ్రహ్మలక్షణముల నన్నియు ఒకచోట చెప్పు ఉపనిషత్తునందున్నది. ఆ బ్రహ్మము యొక్క కర్మ లక్షణము గనుక, కర్మవేదభాగమయిన యజుర్వేదము నందలి ఉపనిషత్తునందున్నది.

"ఋగ్వేదము ఎప్పుడో వ్రాయబడినది. తరువాత మరి ఎప్పుడో యజుర్వేదము వ్రాయబడినది, ఉపనిషత్తుల కాలము వేరు. ఉపనిషతులందు మాత్రమే ఉత్తమభావములున్నవి," అను పాశ్చాత్యవాదములను నమ్ముచారికి వేదము అర్థమగుట కష్టము. ఋగ్యజుస్సామాథర్వణ సంహితలయందే మహామంత్రములున్నవో వాటి వ్యాఖ్యానములే ఉపనిషత్తులు.

బ్రహ్మమనగా ఈ సృష్టినంతయును సృష్టింపగలిగిన జ్ఞానపు ముద్దగదా (ఆపః)! ఆ ముద్ద సర్వమును సృష్టించుచున్నదిగదా (ఆపః)!సృష్టింపబడిన వేరువేరు రూపములను మనము "చూచు"చున్నాము గదా(ఆపాః). ఈ మూడు బ్రహ్మలక్షణములు, మన యందును ఉన్నవి. కాని మనము "అన్నిటిని" ఊహింపలేము. ఊహించిన అన్నిటికొరకు ప్రయత్నము సేయలేము. ప్రయత్నము చేసిన అన్నిటిని సాధింపలేము. అనగా మనది పరిమిత జ్ఞానము. పరిమిత యత్నము, పరిమిత భాగ్యము. మనలో నున్న "అపః"; "ఆపః"; "ఆపాః" – లు పరిమితములు.

ఆ సంపూర్ణ జ్ఞాన, యత్న, భాగ్యములను సాధించుట ఎట్లు? ఏ మహా మంత్రములు, ఆ చైతన్యముయొక్క యీ మూడు లక్షణములను సంపూర్ణముగ వివరించినవో, ఆ మహా మంత్రములను అర్థము చేసుకొనుటకు ప్రయత్నింపవలెను. అదియే వేదము చెప్పిన తపస్సు. అప్పుడా మూడు లక్షణములు మనయందు క్రమక్రమముగా నభివృద్ధి పొందును.

తైత్తిరీయారణ్యకమునందలి మొదటి మంత్రము దానిని గూర్చియే.

**"ఆపమాపామపస్సర్వాః, అస్మాదస్మాదితోఽమృతః"**

ఆ సర్వమైన అపశ్శక్తి నా ఊహలు పుట్టు చోటు; చోటును అమృతమయమును సేయుగాక! చచ్చు ఊహలు పుట్టకుండుగాక!